# పడగనీడల్లో....

### శ్రీ దుత్తా దుర్గాప్రసాద్

ప్రతి సంఘటనలోంచీ ఓ సిద్ధాంతం లేవదీస్తాడు క్రిష్ణమూర్తి. దానికో చిన్న పిట్టకథ! ఏదో సిగరెట్టు ఇవ్వబోయాడు. వద్దన్నాను నేను. వద్దనడమే కాకుండా "అబ్బ—యీ సిగరెట్లు తాగేవాళ్ళకి నిజంగా బుర్రలేదురా. ఈ వాసనే భరించలేకుండా ఉన్నాను. ఆ సిగరెట్లెలా తాగుతారో" అన్నాను.

అదీ నా తప్పు!

దానిమీద సిద్ధాంతం లేచింది.

యిహ పిట్టకథకోసం చెవులు రిక్కించుకొని కాస్త సర్దుకొని యిసకలో వాలిపోయి అలా పైకి చూడసాగాను.

"రామ్మూర్తి అని యింటర్లో మాకో క్లాసుమేటు ఉండేవాడు. ఎర్రగా, పొడుగాటి మొహమూ, పెద్ద నిలువుబొట్టూ చూస్తుంటే ఏడిపించాలనిపించేది కుర్రాళ్ళకి. ఎప్పుడూ పూర్వుల గొప్పతనాన్ని గురించీ, మన తక్కువతనాన్ని గురించీ వసపిట్టలాగు వాగుతుండేవాడు.

శ్రీకాకుళం దాటిపోయాక మరో యిరవై మైళ్ళలో అదేదో చిన్న ప్రాజెక్టు ఉంది. దానిపేరు గుర్తు రావడంలేదు. సరే, ఏదయితేనేం, చిన్న ప్రాజక్టు.

రామ్మూర్తి వాళ్ళ నాన్న అర్చకుడు. ఆయనకి జ్యోతిషము బాగా తెలుసు. పెద్ద యింజనీరుగారి ఆఫీసులో మేనేజరు గారికి జ్యోతిషం అంటే వల్లమాలిన నమ్మకం. చదువుకొనే రోజులనుండీ ఆచార్లు గారంటే ఆయనకి ఎంతో గురి కుదిరింది. చిన్నదానికీ, పెద్దదానికీ ఈయన్ని సంప్రదిస్తేనేగాని ఏ పనీ చేసేవాడుకాదు.

సరే, ఆయన ప్రాపకంతో అక్కడో మేస్త్రీ ఉద్యోగం సంపాయించాడు రామ్మూర్తికి ఆచార్లుగారు. మనవాడు మంచిరోజు చూసుకొని పోయి ఒక శుభముహూర్తాన ఉద్యోగంలో చేరాడు.

అక్కడో చిన్న చెరువు తయారు చేస్తున్నారు. ఇద్దరు జూనియరు యింజనీర్లు ఉండేవారు ప్రాజెక్టుకంతా. అసిస్టెంట్ యింజనీరు శ్రీకాకుళంలోనేఉండి అప్పుడప్పుడు వచ్చి పోతూ ఉంటాడు. ఇద్దరు 'జేయీ'ల్లోనూ, ఒకాయన 'హెడ్‌వర్క్సు' మరో ఆయన పిల్ల కాలువల పనీ చూస్తూ ఉంటారు. రామ్మూర్తిని 'బండ్' మీద వేశారు.

జోరుగా తిరిగే లారీలూ, చెవులు దిబ్బళ్ళుపడేట్టు శబ్దం చేసే బుల్‌డోజర్లూ, భూకంపం పుట్టించే స్క్రేపర్లూ, నోరు తెరుచుకు చూస్తూ కాలం గడిపాడు రామ్మూర్తి మొదటి రోజంతా.

రెండో రోజున అక్కడవుండే యిద్దరి మేస్త్రీలతోటీ పరిచయమైంది. సింహాద్రి ఒకతని పేరు. ఏమంత చదువుకొన్నవాడు కాదతను. అతివినయం, కలుపుగోలుతనం ఎక్కువ. ఎంతో మర్యాదగా అవీ యివీ చూపించి రెండో మేస్త్రి సత్యనారాయణతో పరిచయం చేశాడు.

సత్యనారాయణ హైస్కూలు చదువు ముగించినవాడు. నున్నటి క్రాపూ, పైజామా, లాల్చీ—పూలరంగడులా ఉంటాడు. ఎన్నో ఢక్కా ముక్కీలు తిని బండపారిన మనిషి. ఎంతటివాడినీ మూడు నిముషాల్లో కట్టుకురాగలడు. అవసరమైతే ఎదురు తిరిగి ఆఫీసర్లని ఒక్క వూపు వూపగల శక్తికూడా వుంది. పనిలోని లోటుపాటులన్నీ తెలుసుకొన్నవాడు కనుక వోరకంగా అతనంటే భయపడతారు ఆఫీసర్లు. కాని, అది బైట పడనీయకుండా బెట్టుగానే పని చేయించుకు పోయేవాడు జేయీగారు. ఆయనలో వో మూలని సత్యనారాయణంటే ద్వేషం లేకపోలేదు. అయితే, నిండైన మనిషి కనక పైకి కనపడనిచ్చేవాడుకాదు దాన్ని.

మస్టరువేసే మనిషి సత్యనారాయణే అక్కడ. మస్టరు మేస్త్రీకిఉన్న విలువ పెద్దపెద్ద ఆఫీసర్లకూడా ఉండదు కూలీల దగ్గర. అతన్ని తప్పిస్తే మరో మేస్త్రీని లెక్కచేసే వాళ్ళుకాదు అక్కడి కూలీలు.

ఆ రోజుల్లా అలా నిలబడి అక్కడి వ్యవహారాలన్నీ తెలుసుకోసాగాడు రామ్మూర్తి. సింహాద్రి గొంతుపగిలేటట్టు అరుస్తున్నా అతన్నెవరూ లెక్కచేయడంలేదు. సింహాద్రి పోయి సత్యనారాయణతో మొరపెట్టుకుంటే అతను పోయి "అప్పలమ్మా, ఉషారెక్కుతున్నట్టుందే, ఏయ్ సీతీ, తిమ్మిరి తిమ్మిరిగా ఉన్నట్టుంది........జాగ్రత్త" అంటూ అసహ్యంగా మోటుగా మాట్లాడడమూ, వాళ్ళు కళ్లెగరేసి, మూతిబిగించి వెక్కిరిస్తూ, ముసిముసి నవ్వులు నవ్వడం, యిదంతా చూచి 'సత్యనారాయణ వో పశువు' అనుకొన్నాడు రామ్మూర్తి.

ఇంటికొచ్చేటప్పుడు అదే అన్నాడు సింహాద్రితోటి. సింహాద్రి నవ్వి "అతని స్వభావమే అంతండీ—మళ్ళీ బాగా చదువుకున్నవాడుట గూడా. ఆడమనిషి కనిపిస్తే చాలు, సరసా లాడకుండా వదలడు. అలా వాళ్లంట పడుతుంటే మేస్త్రుళ్ళంటే వాళ్లకి ఏం లెక్కుంటుంది. చెప్పండి! మరీ ఆ అప్పలమ్మ ఉంది చూశారూ—ఆ కనకాంబరాలు తల్లో పెట్టుకున్న మనిషండీ—స్లోపుమీద నీళ్ళు చల్లడం లేదూ యిందాక ఆ మనిషి—దాంతో యీయనికి బోలెడు వ్యవహారాలు ఉన్నయ్యి! నారాయణరావుగారనీ, యస్. డి. వో. మొన్నే బదిలీ అయి పోయారు. ఆయన మొదలుకొని క్లీనర్లవరకూ ఆ మనిషంటే పడి ఛస్తారండీ! అందుకే దానికంత గర్వం. మనిషంటే లెక్కే లేదు...." చెప్పుకుపోతున్నాడు సింహాద్రి.

సరిగ్గా యిక్కడే రామ్మూర్తి బుర్ర తపీమని ఆగి ఆలోచించసాగింది. 'ఛీ—వెధవ మనుషులు—ఎంత హీనాతి హీనమైన జీవులు వీళ్లు! ఒకడు సూటు వేస్తాడు. కార్లమీద తిరుగుతాడు. పెద్ద పెద్ద విషయాలు ఆలోచిస్తాడు. మరొకడు అతి తక్కువ హోదాలో బతకలేక బతుకుతూంటాడు, మానలేని అవగుణాలతో. కాని యిద్దరూ ఈ విషయం వచ్చే సరికి ఒకే చోటుకి చేరుకుంటారు. ఆ హోదాలన్నీ ఎటు పోతాయో! ఛీ, ఛీ, మనస్సుకి దాసానుదాసులు వీళ్లు! అయినా ఆ అప్పలమ్మకి ఎలా బుద్ధిలేదో! అప్పలమ్మంటే యిందాక సత్యనారాయణ తిడుతోంటే వెకిలినవ్వు నవ్వుతున్న మనిషే కాబోలు. ఆ బట్టలూ, ఆ వైఖరీ చూస్తుంటే అప్పుడే అనిపించింది తనకి, పని చేసే రకం కాదని. ముడత నలగని చీరా, ఆ సినిమా జాకెట్టూ, తలనిండా పూలూ అవీ చూసి. ఈ సత్యనారాయణకి బుద్ధి లేకపోతే పోయింది. ఆ పెద్ద అధికారులెలా వూరుకొంటున్నారో!'

ఇంటికి పోయి పడుకొన్నాడు. నిద్దర రావడంలేదు. బుర్రనిండా ఆలోచనలు. తన చేతికే మస్టరువస్తే నలభై యేళ్లకి తక్కువ వాళ్లంటూ వుండనీయకూడదు పని మీద. ముందీ అప్పలమ్మని పనిమీదినుండి గెంటివేయాలి. చల్లగా జేయీ దగ్గర పలుకుబడి సంపాయించాలి. పొద్దున బాగానే మాట్లాడాడాయన. పాపం యివన్నీ పట్టినట్టు లేదాయనికి. "అవుట్ టరన్" వచ్చిందా అని కనిపించినవాడినల్లా అడగడమేలాగుంది ఆయన పని. తనకి ఆ మాటకి అర్థం కూడా తెలియలేదు. వెర్రిమొహం వేసుకొని నిలబడితే, ఆయనే తెలుసుకొని అన్నాడు. "ఎన్ని యూనిట్లు రోల్ అయింది?" అని. రోజుకి యిరవైమూడు యూనిట్లన్నా అయితేగాని ఆ కూలీలకి మస్టరు రాదట. అప్పుడర్థమయింది, యీ గొడవతనకి.

మరో రెండు రోజులు కొత్తకొత్తగానే గడిచిపోయాయి. కాస్త అర్థమయింది రామ్మూర్తికి ప్రాజెక్టంటే యేమిటో. తనంతట తానే పని చేయించగల స్థితికి వచ్చాడు మరికొన్నాళ్ళకి. ఆ రోజు సాయంకాలం జేయీగారు కబురంపాడు యింటికి రమ్మని. ఆవేవో స్టేట్మెంట్లు యిచ్చి కాపీ చేయమన్నాడు. ఆ తర్వాత లేబరు చార్టులకి రంగులు పూయించాడు. "రోజూ వచ్చి ఆఫీసులో వో అరగంట పని చేయండి. మీకూ పని తెలుస్తుంది" అన్నాడు వచ్చేటప్పుడు. తను సరేనన్నాడు.

రోజూ ఆఫీసుకు వెళుతూనే ఉన్నాడు. పని కూడా ఏమంతలేదు. ఏవో నాలుగు కాగితాలు 'ఫేర్ కాపీ' రాసి పడేస్తే చాలు. దాంతో కబుర్లు అందుకొంటాడు ఆయన. వాళ్ళ కాలేజీ రోజులూ, అనంతపురం బజార్లూ కాలేజీ ప్రొఫెసర్లూ ఆ గొడవలన్నీ చెప్పుకొస్తాడు. కాని, ఎంతసేపు మాట్లాడినా విసుగెత్తదు ఆయనతోటి.

జేయీగారి దగ్గర కాస్త చనువు దొరికినప్పటినుంచీ సత్యనారాయణ తనని తప్పుకు తిరగసాగాడు. ఎప్పుడన్నా మాట్లాడినా, వెక్కిరింతగా, వ్యంగ్యంగా మాట్లాడతాడు. అందుకని రామ్మూర్తి అసలు మాట్లాడడమే మానేశాడు అతనితోటి.

ఆ విధంగా ఉండగా వో శుభదినాన సత్యనారాయణ ఎందుకో పది రోజులు సెలవుపెట్టి యింటికి పోయాడు. జేయీ రామ్మూర్తిని, పిలిచి మస్టరు చేతిలో పెట్టాడు. అప్పుడు నిజంగా రామ్మూర్తి మొహమైతే మామూలుగానే పెట్టాడుగాని, మనస్సులో తానో రాజాధిరాజు అయినట్లు ఫీలయ్యాడు.

బయటికొచ్చి సింహాద్రికి చెప్తే అతను మొహం యింత చేసుకొని "కాఫీ యిప్పించాలండీ" అన్నాడు.

"ఎందుకు?" అన్నాడు రామ్మూర్తి.

"ఎందుకేమిటి! నేను రెండేళ్ళబట్టి పని చేస్తున్నాను యిక్కడ. మన జేయీగారు సత్యనారాయణకి తప్పితే దేవుడిక్కూడా యివ్వలేదు మస్టరు. అతను లేనప్పుడు ఆయనే వచ్చి 'మార్కు' చేసుకొంటాడు. అలాంటిది మీ చేతికిచ్చాడంటే నిజంగా మీ అదృష్టమే అనాలి!"

"అదృష్టం ఏముంది యిందులో?"

"అలా అంటారేమిటండీ—మీ వోపికకొద్దీ ఫలం" అన్నాడు సింహాద్రి నవ్వుతూ, మహాతెలివిగా మాట్లాడుతున్నట్టు.

చచ్చిందాకా పట్టుకు తందామనిపించింది రామ్మూర్తికి. సింహాద్రిని. అయినా అతని అమాయకత్వంచూచి వోర్చుకొన్నాడు.

ఆరాత్రి నిద్రపట్టలేదు. బయటికొచ్చి మర్రిచెట్టు కింద వెన్నెట్లో కూర్చుని రేప్పొద్దుటి కార్యక్రమం ఆలోచించుకోసాగాడు. పోగానే అప్పలమ్మకి ఆబ్సెంటు మార్కుచేసి యింటికి పంపేయాలి. మిగిలినవాళ్ళని గట్టిగా దబాయించేయాలి ఒకసారి. అప్పలమ్మ అదరిపోతుంది! పొగరూ, గిగరూ గాలికి పోవాలి.

అయితే, పాపం యింటి దగ్గర ఏమైనా తినడానికిఉన్న మనిషో కాదో! తనిక్కడ ఆబ్సెంటువేసి పంపిస్తే తన జీవానికి పడి అల్లాడుతుందేమో! వో మారు దబాయించి వదిలితే పోదూ? లేదు, లేదు, దాని పొగరు అలాపోదు. రామ రామ ఎంత గర్వం! ఆ రోజున తను 'బండు' మీద నడిచి వస్తుంటే పుసుక్కున "ఏం మేస్త్రిగారూ, కాళ్లాపుకొంటూ వచ్చావ్, వర్షం పడిందిగా నిన్న—యియ్యాల పనొద్దన్నారంట జేయ్‌గారు—పాపం ఎల్లండి యింటికి" అంది ముసిముసి నవ్వులు నవ్వుతూ! తనకి నోటంట మాట పెగిలి రాలేదు. కాస్త దూరంపోయి ఏదో చెప్పుకొంటూ గొల్లున నవ్వారు పక్కనున్న వాళ్ళంతా! అబ్బా—ఆరోజున తల పగలగొట్టుకు చద్దామనిపించింది.

"లాభంలేదు. అప్పలమ్మకి ఆబ్సెం టేయాలిసిందే' అని నిర్ణయించుకొన్నాడు. కోడి కూసేసింది.

ఒక్క కునుకుతీసి, పొద్దున్నేలేచి శుభ్రంగా స్నానం చేసి మంచి బట్టలు లగాయించి బయలుదేరాడు రామ్మూర్తి పని మీదికి.

సింహాద్రిగాడు అప్పుడే కబురు చేరేశాడులావుంది, అంతా బుద్ధిమంతుల్లా నిలబడి భయంభయంగా చూస్తున్నారు తనకేసి. అప్పలమ్మ ఎక్కడుందా అని చూశాడు. సీతి చాటున దాక్కుని నిక్కి నిక్కి చూస్తోంది. అదే అవతారం! నాలుగు కళ్ళూ దఫాలున కలవగానే ఒంట్లో కరెంటు పుట్టుకొచ్చింది. హడలిపోయి మస్టరు తెరిచేశాడు.

మొగాళ్ళకి మార్కింగు అయిపోయింది. యిహ ఆడాళ్ళ—

ఆంజమ్మ ప్రజెంటు.

అంకమ్మ ప్రజెంటు.

అప్పలమ్మ ప్రజెంటు—కాదు!

గుండెలు దడదడలాడుతున్నయ్. ఒళ్ళంతా చెమట పట్టేసింది. శిలలా నిలబడిపోయి ఆలోచించసాగాడు. అప్పలమ్మ జేయీతో రిపోర్టు చేస్తుందేమో! అందులో ఆ రిపోర్టు చేస్తూ చేస్తూ రెండు సొంత మాటలు జోడించిందంటే తన పని ఖాళీయే! తనను కూడా సత్యనారాయణ రకంకిందే జమ కట్టేస్తుంది లోకం దాంతోటి.

ఒణికిపోతున్నాడు రామ్మూర్తి.

బుల్‌డోజరు హోరున గోడు పెడుతూ తన దగ్గరికొచ్చి ఆగిపోయింది. డ్రైవరు కిందికి దూకి సలాం కొట్టాడు. చటుక్కున యీ లోకంలో పడ్డాడు రామ్మూర్తి. కాని, మస్టర్లో అప్పటికే ప్రజెంటు పడిపోయిఉంది, అప్పలమ్మ పేరు ఎదురుగా! తన బలహీనతని గమనించి నిశ్చేష్టుడైపోయాడు.

ఆ రోజంతా పనేమీ చేయలేదు. మొహం పాలిపోయి నోట మాట రావడంలేదు. నిశ్శబ్దంగా పాకలోకిపోయి కూర్చున్నాడు.

ఇంటికొచ్చి ఆలోచించుకోసాగాడు. 'తనలో అంత బలహీనత ప్రవేశించడానికి కారణం యేమిటా' అని. అప్పలమ్మ పుకారు లేపుతుందనే భయమేనా? అదొక్కటే కారణంఅయి ఉండదు!

తనావైపు చూసినప్పుడు తనకేసే కన్నార్పకుండా చూస్తోంది. ఆ కళ్ళల్లో అంతకుముందటి అప్పలమ్మ కనిపించలేదు తనకి. అమాయకంగా లేడికళ్ళలా ఉన్నాయి. అప్పలమ్మ నిజంగా అందాలరాసి. ఆ కాటుక కళ్ళల్లో ఎంతో ఆకర్షణవుంది. అందుకనే అంత పెద్దపెద్దవాళ్ళ కూడా "దాసోహం" అని ఉంటారు. ఈ బలహీనతే తన్నలాచేసి వుంటుంది. తను కూడా మామూలు రకం మనిషే అయిపోయాడు... ఛీ ఛీ......ఏమిటీ ఆలోచనలు! ఆ నీతిలేనిమనిషిని గురించి యింతగా ఆలోచించడం అర్థంలేని పని. వదిలేస్తే ఏ గొడవాలేదు. లేనిపోని సమస్యలు కొని తెచ్చుకోడం దేనికి పది రోజుల భాగ్యానికి?

ఎంతో గట్టిగా అనుకున్నా డీ మాటలు. కాని నిద్ర మాత్రం పట్టలేదు.

మర్నాడు పనిమీదికెళ్ళాడు. మనసు ప్రశాంతంగానే అట్టిపెట్టుకొన్నాడు ఎంతో ప్రయత్నంమీద. అందర్నీ దబాయించేస్తున్నాడు పని చేయండని. అటూయిటూ కేకలు పెడుతూ తిరుగుతున్నాడు. రోలరు డ్రైవరుతో చక్రం దగ్గర దగ్గరగా తిప్పమని చెబుతున్నాడు. నీళ్లలారీ క్లీనరుతో నీళ్ళ పల్చగా చల్లమంటున్నాడు. అటువైపు స్లోపుమీద దిమ్మెసలతో బాదిస్తున్నాడు.

కాని, యింత గొడవలోనూ—ఒక్కసారి, ఒకే ఒక్కసారి అలా చూద్దామని అనిపిస్తోంది. తెచ్చిపెట్టుకొన్న ఈ ఆర్భాటమంతా మంచులా కరిగిపోయింది. వోరగా చూశాడు.

యిటే చూస్తోంది అప్పలమ్మ, చేతులో కడవ పెట్టుకొని వయ్యారంగా! గతుక్కుమన్నాడు. బెంబేలుపడిపోయి పాకలోకి పరిగెత్తాడు.

'అరె— ఆ పిశాచం గమనించేసింది! యిహ తనెందుకూ పనికిరాని వెధవ దానిదగ్గర. యిక్కడ పడివున్న శతకోటి వెధవల్లోనూ వో వెధవకింద-జమ కడుతుంది కాబోలు తనని కూడా! తనెందుకూ కొరగాడిక!

అయినా, అనుమానం మళ్ళీ తగిలింది. తడిక సందులోంచి మరోమారు చూశాడు అటుకేసి. లేత ఆకు పచ్చ చీర, దానిమీద బిర్రుగా తెల్లటి వాయిల్ జాకెట్టు—మనిషి బిగువుగా బొద్దుగా వుంది. తలనిండా పూలు—గుండ్రటి మొహం—కాటుక పులిమిన కళ్ళు!

"బాబోయ్ నాకు పిచ్చెత్తింది! నాకు పిచ్చెత్తేసింది' అంటూ భోరున యేడిచాడు తల బల్లమీద ఆనించి. బిరబిరా వో కాయితంతీసి సెలవు రాసేసి సింహాద్రి చేతికిచ్చి పరిగెత్తుకొంటూ పోయాడు యింటికి.

ఆ దెబ్బతో రెండు రోజులదాకా మళ్ళీ వాకిలి దాటలేదు. సింహాద్రివచ్చి "ఏమిటండీ, ఎందుకు సెలవు పెట్టారు?" అంటూ ఆరాలు తీయసాగాడు. ఏమీ చెప్పలేక 'రక్త విరేచనాలు' అన్నాడు. ఆ రోజు సాయంకాలం జేయీ చీటి రాసి పంపాడు, ప్యూన్‌చేత, తను అవసరంగా శ్రీకాకుళం వెళుతున్నాననీ, తప్పకుండా పనిమీదికెళ్ళి జాగ్రత్తగా చూచుకోమనీ.

ఈ నలభై యెనిమిది గంటల్లోనూ బుర్ర కాస్త దారి కొచ్చింది. తనూ, తన చదువూ, తల్లిలేని తన చెల్లెళ్ళూ యింకా బోలెడన్ని విషయాలూ గుర్తుకు తెచ్చుకొన్నాడు. నేరుగా పనిమీదికిపోయి అందరికీ మస్టరేసి తాను దూరంగా 'బారోపిట్సు' దగ్గరికెళ్ళి నిల్చున్నాడు. ఆ రోజున స్కేవర్లూ అవీ చూస్తూ హుషారుగానే గడిపేశాడు.

మరో వారం రోజులు ఏ గొడవా లేకుండా గడిచిపోయాయి. సత్యనారాయణ దిగాడు సెలవు అయిపోగానే.

"మస్టరు సత్యనారాయణ కిచ్చేస్తానండి" అన్నాడు రామ్మూర్తి జేయీగారితో.

"ఒద్దు, మీ దగ్గరే వుంచండి" అన్నా డాయన సీరియస్‌గా.

రామ్మూర్తి ఏదో చెప్పాలనుకొన్నాడుగాని, ఆయన మొహంమీది నిశ్చలమైన నిశ్చితాన్ని చూసి మరి మాట్లాడలేదు.

ఆ రోజునుంచి సత్యనారాయణ తనకేసి పులిలా చూడసాగాడు. బండుమీద గొడవ లెక్కువయ్యాయి. కూలీలంతా కట్టకట్టుకొని సత్యనారాయణకి ఎదురు తిరిగారు. అణచిపెట్టుకున్న వాళ్ళ కోపమంతా కాస్త సందు దొరకగానే నురుగులు కక్కసాగింది. రామ్మూర్తే వెళ్ళి దబాయించి సర్దేశాడు అప్పటికి.

రోజులు మెల్లిగా గడచిపోతూ ఉన్నాయి. జేయీ దగ్గర 'డిస్కవరీ ఆఫ్ ఇండియా' తీసుకొని చదవసాగాడు. దానితో శుభ్రంగా కాలక్షేపం అవుతోంది.

ఈ సెప్టెంబరు పరీక్షలతో అదే బాధ. పోనయి కూడా గోళ్ళు గిల్లుకొంటూ మళ్ళీ కాలేజీలు ఎప్పుడు తెరుస్తారా అని జపం చేయాలి. ఒక గాడిలో తిరిగే విద్యార్థి జీవితం, కాస్త విరామం దొరికేసరికి పిచ్చివేషాలు వేయడం సాగిస్తుంది. దాంతో భవిష్యత్తంతా పెద్ద దెబ్బతింటుంది. లేకపోతే బి. ఏ. చదువుతూ ఉండవలసిన రామ్మూర్తికి అర్థాంతరంగా ఈ ఉద్యోగం ఏమిటి.

అన్ని రోజుల్లాగానే ఆ రోజూ వచ్చింది. కాని ఆ రోజు అతని జీవితాన్ని ఒక్క వూపు వూపి పోయింది.

అయిదింటికి గంట కొట్టించి అందర్నీ పంపేశాడు. పడిపోయిన 'పెగ్గు'లు మళ్ళీ కొట్టిస్తున్నాడు బండుమీద రేపటి పనికి ఆటంకం లేకుండా. ఇంతలోనే జేయీగారు వచ్చాడు సైకిలుమీద. "మీకు లెవలింగు తెలుసా?" అని అడిగాడు రామ్మూర్తిని. తెలియదన్నా డతను.

బండుమీద లెవలుపెట్టి రీడింగులు రాసుకొన్నాడు పుస్తకంలో. రామ్మూర్తిని దగ్గరికి పిలిచి చూడమన్నాడు. ఏదో మసకమసకగా ఉంది అందులోంచి చూస్తే.

"ఏం కనిపిస్తోంది?"

"ఏమీ కనిపించడంలేదండి"

"సరిగ్గా చూసి చెప్పండి—ఆఁ యిప్పుడు చూడండి" అంటూ పక్కనేఉన్న ఓ చక్రం తిప్పాడు.

అవును. యిప్పుడు కనిపిస్తోంది. కొలతబద్దమీద 'V' తిరగబడి కనిపిస్తోంది. ఆ మాటే చెప్పాడు ఆయనకి.

"గుడ్—మీరు చూచింది పాయింట్ ఫైవ్ అన్న మాట. వస్తువులు తలకిందులుగా కనిపిస్తయ్‌లెండి యిందులో—సరే, యిహ లోపల పెట్టించేయండి" అని పెట్టె సర్దేశాడు.

"రండి వెళదాం" అన్నాడాయన సైకిలెక్కకుండా నడుస్తూ.

దారిలో ఆయన చాల విషయాలు మాట్లాడాడు. తన ప్రమోషనూ, పెళ్ళి వ్యవహారం, తన యిష్టాయిష్టాలూ చాలా చెప్పుకొచ్చాడు. ఇంత నిర్మలమైన మనుషులుంటారా అనిపించింది తనకి. లేకపోతే ఆయన పెళ్ళి వ్యవహారాలు తనతో చెప్పవలసిన అవసరం యేమిటి!

కాంటీను దగ్గర కాఫీ యిప్పించి ఆయన క్యాంపులోకి వెళ్ళిపోయాడు సైకిలుమీద.

ఆరుగంటలు దాటిపోయింది. మసకమసకగా వుంది. రెండు మైళ్ళు నడవాలిప్పుడు. ఈ నడకనుంచి తప్పించుకోవాలని ఎంతో ప్రయత్నం చేశాడతను. కాని క్యాంపులో ఎంత ప్రయత్నం చేసినా యిల్లు యివ్వలేదు. అందువల్ల దగ్గర్లోనేవున్న మిట్టపల్లి అనే ఊళ్లో చిన్న యిల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. పని మీదికివెళ్ళే కూలీలంతా దాదాపు ఆవూరినుంచే వస్తారు.

మెల్లగా నడుస్తూ ఉన్నాడు దిక్కులు చూస్తూ. ఆకాశం సంజకాంతులు కక్కుతూ, అప్పుడే నేర్చుకొంటున్న

కుర్రాడు వేసిన రంగుల బొమ్మలావుంది. చుట్టూ పేర్చి పారేసిన రాయంతా గుట్టలు గుట్టలుగా పేర్చి వుంది. ఏదో ఆలోచించుకొంటూ వస్తున్నవాడల్లా పాముతోక తొక్కినట్టు అదిరిపడ్డాడు. గుండె యింజనులాగు కొట్టుకోసాగింది. ఒళ్ళంతా చెమట పట్టేసింది. రాళ్ళ గుట్టల మధ్యనుంచి నడిచివచ్చి రోడ్డు అందుకొంది అప్పలమ్మ. బట్టలన్నీ నలిగిపోయివున్నయ్. జుట్టంతా రేగిపోయి గాలికి కొట్టుకొంటోంది. తలలోంచి నలిగి రాలిన పూలు భుజాలమీదపడి మూలుగుతున్నయ్.

రామ్మూర్తినిచూసి గాభరా పడింది అప్పలమ్మ. కాని వెంటనే తెరులుకొని మెల్లగా పలకరించింది.

"యింత ఆలెసెంగా పోతున్నావేం మేస్త్రిగారూ యియ్యాల"

రామ్మూర్తి తెప్పరిల్లి "ఆఁ......మ......మరి....ప.....పనుండి.....ఆగిపోయాను" అన్నాడు.

అప్పలమ్మ నవ్వుకొంది ముసిముసిగా.

రామ్మూర్తి ముందు నడుస్తున్నాడు ఉక్కిరి బిక్కిరయిపోతూ. గాలి పీలవడమే మహా కష్టమయిపోతోంది. గబగబా నడుస్తున్నాడు.

"అంత బేగీ లగెడతారేటండి మరీనీ" అంది గోముగా.

"అబ్బే....యింటి దగ్గర ముసిల్ది కాచుక్కూచునివుంటుంది, నీళ్ళ కడవకోసం. నీళ్ళు లేకపోతే పస్తే యివ్వాళ" అన్నాడు గబగబా పాఠం ఒప్పచెప్పినట్టు.

"అంత కరువేటండి నీళ్ళకి. నే తెచ్చి పోత్తాన్లెండి ఆనక వో కడవ. దాని కంత బయమేటి మేస్త్రిగారూ"

అదిరిపోయాడు యీ సలహాకి రామ్మూర్తి. అయినా మాట్లాడలేదు. మెదలకుండా నడుస్తున్నాడు.

"మేస్త్రిగారూ—మీకు పెళ్ళవలేదేటండి యింకా"

భూకంపం పుట్టింది! హరహరా అనుకొన్నాడు. కాళ్ళు గజగజ వణికిపోతున్నయ్. 'ఈ కాళ్ళల్లో మేకులు దిగగొడితే ఎంత బావుణ్ణు' అనుకొన్నాడు రామ్మూర్తి. దఢాలున ఒంగి పాదాలు చూచుకోసాగాడు, "ముల్లు దిగినట్టుంది' అని సణుగుతూ. ఈలోగా అప్పలమ్మ అతన్నిదాటి ముందుకొచ్చి, వెనక్కి తిరిగి అతనికేసి చూస్తూ "ఏటండి" అంది ఆదుర్దాగా.

కళ్ళెత్తి చూశాడు రామ్మూర్తి.

రేగిపోయిన జుట్టు చిందరవందరగా గాలికి ఎగురుతూ ఉంది. గుండ్రటి మొహంలోంచి రెండు నల్లటి కళ్ళు చిలిపిగా చూస్తూ వున్నయ్. పిచ్చెత్తుతోంది రామ్మూర్తికి. నడక సాగించాడు మళ్ళీ.

ఈ మారు అప్పలమ్మ ముందు నడుస్తోంది. రెండు మూడు గజాల వెనక ఉన్నాడు రామ్మూర్తి. వెనకకి వచ్చాక కాస్త ఊపిరి ఆడసాగిందతనికి. రెండు కళ్ళూ తాటికాయలంతచేసి, అప్పలమ్మ ప్రతి కదలికనీ గమనిస్తున్నాడు వెనకనుంచి. గుండెల మధ్య ఏదో డైనమో పని చేస్తోంది. అక్కడినుండి నాడినాడికీ విద్యుత్తు పరిగెడుతోంది.

కాలిబాట దగ్గర ఆగి వెనక్కి తిరిగి "నీళ్ళు నేనట్టుకొత్తానులెండి మేస్త్రిగారూ" అనేసి వెళ్ళిపోయింది.

రామ్మూర్తికి నూటికి నూరు పాళ్ళూ పిచ్చెత్తింది, ఈ పాటికి. వాకిలి తెరిచి ముసలమ్మకి కడవ అందించాడు. మర్రిచెట్టుకింద కూచుని ఎక్కడెక్కడో వూహాలోకంలో తిరగసాగాడు. ఏడయింది— ఎనిమిదయింది.

లోపలికెళ్ళి పొద్దుటి అన్నంవుంటే పెట్టుకుతిన్నాడు, వో ఆవకాయ ముక్కేసుకొని. కాని తిండిమీద లేదతని మనసు.

భోంచేసి మంచం వేసుకు పడుకొన్నాడు బయట. ఆకాశంలోకి చూస్తూ ఆలోచించ సాగాడు. మళ్ళీ ఎదురు తిరిగింది మనస్సు.

తనూ, తన చదువూ, తల్లిలేని చెల్లెళ్ళూ, తండ్రి ఆచారం—తన ఆదర్శాలూ—అన్నీ గుర్తుకొచ్చాయి.

"ఛీఛీ నేను పశువుని—పశువుని—నూటికి నూరుపాళ్ళు పశువుని" అని దిండులో తలదూర్చి వెక్కివెక్కి యేడిచాడు.

దిండు తడిసి ముద్దయింది.

ఉన్నట్టుండి గభుక్కున లేచాడు. ఏదో నిశ్చయానికొచ్చినట్టు ముహం గంభీరంగా పెట్టుకు కూర్చున్నాడు. లోపలికెళ్ళి చరచరా వో పోస్టుకార్డు రాశాడు యింటికి, తను క్షేమంగా ఉన్నాననీ, చెల్లెళ్ళ క్షేమాలు తెలుపమనీ, వారం రోజుల్లో డబ్బు పంపుతున్నాననీ, వాళ్ళకి బట్టలు కుట్టించమనీ.

అడ్రసురాసి గూట్లోపెట్టి వచ్చి మళ్ళీ పడుకొన్నాడు. తలుపేసి. ఈ మారు కాస్త తేరుకొన్నట్టుంది మనస్సు. దుప్పటి గొంతుదాకా బిగించి, మర్రిచెట్టుకేసి చూస్తూ తన బి. ఏ. గురించి ఆలోచించసాగాడు. రేపటినుంచి తన పని తప్పితే మరో విషయం పట్టించుకోగూడదనుకొన్నాడు. తన పిచ్చిగాని యిప్పటిదాకా జరిగిందాన్లో ఏముంది అనుకొన్నాడు. హృదయం తేలికయింది. అదోరకమైన మైకం కమ్ముకొచ్చింది. మగతగా కళ్ళు మూయసాగాడు.

వాకిటి దగ్గర చప్పుడైంది. తలెత్తి చూశాడు. సున్నం కొట్టినట్టయింది మొహం. పాలిపోయి ప్రేతకళ ఆవరించింది దానిమీద.

యుద్ధం జరుగుతోంది అతనిలో—మంచికీ చెడుకీ, మనస్సుకీ శరీరానికీ మధ్య యుద్ధం జరుగుతోంది.

మెల్లిగా కళ్ళు తెరిచి చూశాడు లేచి కూర్చుని.

అప్పలమ్మ ప్రహరీ దాటి లోపలి కొచ్చేసింది.

చంకలో కడవ, సన్నని వాయిల్ చీర గాలికి రెపరెపలాడుతోంది. నున్నటి శాటిన్ జాకెట్టుమీద వెన్నెలపడి మెరిసిపోతోంది. తలనిండా తెల్లటి మల్లెపూలు అప్పుడప్పుడే విచ్చుతూ, మత్తయిన సువాసనని వెదజల్లుతున్నయ్. బెరుకు బెరుకుగా చూశాడు అప్పలమ్మ కళ్ళలోకి, తోడేలు ముందు నిల్చున్న మేకపిల్లలాగు.

"నీళ్ళు కావాలన్నారు కదండీ" అంది గోముగా మొహం పెట్టి, కడవదించి నేలమీద పెడుతూ.

పన్నెండు గంటలప్పుడు నీళ్ళు!

ఈ అవతారంలో నీళ్ళు.

ఆ కళ్ళతో నీళ్ళు!!!

పిశాచం పట్టిన వాడిలాగు లేచి నిలబడ్డాడు రామ్మూర్తి. శరీరమంతా సలసలకాగిపోతూ పొగలు కక్కుతూవుంది. కుడి చేయి యాంత్రికంగా వెళ్ళి అప్పలమ్మ ఎడమభుజంమీద వాలింది.

చేతికి స్పర్శ తగలగానే వింతైన మార్పు కలిగింది. రామ్మూర్తిలోంచి విద్యుత్తులాగు ఒక 'శక్తి' ఛళ్ళున లేచింది. ఆ శక్తి అతనిలో అంతకుముందు ఉన్న బలహీనతని పార దోలింది. భావిలో రెండు రోజులు నాని బైటపడిన శవాన్ని చూచినప్పుడు కలిగేటటువంటి జుగుప్సాకరమైన ఓ అనుభూతితో ఒళ్ళు జలదరించింది.

దాంతో అతనిలోని పిశాచం మరో రూపం దాల్చి రెండింతలైంది. పిడికిలి బిగించి అప్పలమ్మ గడ్డంమీద ఒక్క గుద్దు గుద్ది హుంకరించాడు, బలమంతా ఉపయోగించి.

అప్పలమ్మ వెళ్ళి నాకిలి దగ్గర పడింది. నోటంట మాట రాలేదు. అరవడానికి ప్రయత్నం కూడా చేయలేదు.

రామ్మూర్తి కోపంతో నురుగులు కక్కుతున్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా మండిపోతూవున్నయ్. మెట్లపక్కఉన్న ఒక పెద్ద బండ తీసి అప్పలమ్మ మీదికి విసరడానికి రెండు చేతులతోనూ పైకి ఎత్తాడు.

ఎదురుగా సత్యనారాయణ ప్రత్యక్షమయ్యాడు! నిర్వికారంగా నిలబడి సన్నగా నవ్వుతున్నాడు.

రామ్మూర్తి హడలిపోయాడు. రెండు క్షణాలు అలాగే చూసి రాయి విసిరిపారేసి మౌనంగా నిలుచున్నాడు.

"ఊరికే తోచక ఎలా ఉన్నారో చూద్దామని వచ్చాను. ఏదో కోపంలో ఉన్నట్టుంది. వెళ్ళొస్తాను" అనేసి వెళ్ళి పోయాడు సత్యనారాయణ. అప్పలమ్మ కూడా కనిపించలేదు. అంతకుముందే వెళ్ళిపోయినట్లుంది.

రామ్మూర్తి సిగ్గుతోనూ, అవమానంతోనూ కుదించుకు పోయాడు. ఒక్క రెప్పపాటులో భయంకరమైన హత్య తప్పి పోయింది. సత్యనారాయణ దేవుడిలా వచ్చాడు సమయానికి. కృతజ్ఞతతో వెయ్యి నమస్కారాలు చెప్పుకొన్నాడు సత్యనారాయణకి మనస్సులో.

దాంతో మామూలు మనిషయ్యాడు రామ్మూర్తి. సుళ్ళుకక్కే నదిలోంచి ఈదుకొచ్చి బైటపడినవాడిలాగు ఒళ్ళు తెలియకుండా నిద్రపోయాడు.

కథ చెప్పడం ఆపాడు కృష్ణమూర్తి.

అయిపోయిందేమోననుకొని "కథ కంచికిపోయుంటుంది" అన్నాను నేను.

"లేదు—మరో ఎనిమిది గంటలు ఆగింది"

తెల్లవారగానే స్నానం అదీ చేసి ఆదరాబాదరా పరిగెత్తాడు రామ్మూర్తి పనిమీదికి, లేటయిందని భయపడుతూ.

కాని పనిదాకా పోనక్కర్లేకపోయింది!

దారిలో తాటిచెట్టుకి ఓ బోర్డుకట్టి ఉంది. "మిట్టపల్లెలో రామ్మూర్తి ప్రణయకలాపాలు! ఆడవాళ్ళమీద బక్కమేస్త్రీ దౌర్జన్యాలు!!"

గుండెలు బేజారెత్తిపోయినయ్. అటూ యిటూ చూశాడు. దూరంగా అయిదారు తాటిచెట్లకి అలాంటి బోర్డులే ఉన్నయ్. ఇవన్నీ, ఒక్క రోజులో రాసినవిలా లేవు. ఒక్కడికంటె ఎక్కువ మంది రాతగా కూడా లేదు. అలా రంగుతో రాయగలిగినవాళ్ళు యిద్దరు ముగ్గురే ఉన్నారక్కడ. అందులో సత్యనారాయణ ఒకడు.

'సత్యనారాయణ ఎందుకు రాస్తాడు? అనుకొన్నాడు. రాత్రి సత్యనారాయణ నవ్విన నవ్వు గుర్తుకొచ్చింది. "ఎంతటి వల పన్నారు!" అనుకొన్నాడు.

సరే ఏమయితేనేం మొత్తంమీద కథ కంచికి వెళ్ళి పోయింది. ఇటు రామ్మూర్తి నురుగులు కక్కుకొంటూ స్టేషను చేరుకొని టిక్కట్టు కలెక్టరు కనిపిస్తే రైలు మించి దూకేయడానికి వీలుగా అట్టడుగు ఫుట్‌బోర్డుమీద నిలబడి ప్రయాణం చేసి యిల్లు చేరుకున్నాడు. ఆ తర్వాత సింహాద్రికి ఉత్తరం రాసి పెట్టే బేడా తెప్పించుకొన్నాడు.

"ఒరేయ్ యిదంతా కట్టుకథ కాదంటావా?" అని నిలేసి అడిగాను కృష్ణమూర్తిని.

"కేవలం కట్టుకథే అయితే రామ్మూర్తి పేరు చెప్పక పోదును. చాలామట్టుకు జరిగిందే. కాస్త వూహాగానం కూడా ఉందనుకో. మొత్తంమీద నే చెప్పొచ్చేదేమిటంటే—

జీవితం కూడా అంతే—

మనిషి పతనం చెందేముందు అతనిలో తీవ్రమయిన సంక్షోభం చెలరేగుతుంది. శరీరానికీ, హృదయానికీ మధ్య జరిగే ఆ యుద్ధంలో లోపలినుంచి ఒక 'శక్తి' ఆఖరిసారిగా విజృంభించి ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తుంది. దాన్ని లెక్కచేయకపోతే, బాధగా ఒక్క మూలుగు మూలిగి చచ్చిపోతుంది. ఆ తర్వాత ఎవడి కర్మ వాడిది!"

ఏమిటి మాట్లాడుతున్నాడీ కృష్ణమూర్తి? సిగరెట్టు గురించి యింత కథ చెప్పాడంటే అర్థంలేదు. ఆఖరు మాటలు అనేటప్పుడు కృష్ణమూర్తి కంఠంలోని జీరా, ఆ మాటల్లోని తొట్రుపాటు ఏదో మనసులో చూసి బిగబట్టుకొని మాట్లాడుతున్నాడనిపించింది నాకు.

కొంపతీసి వీడే ఆ రామ్మూర్తి కాడు గదా?

నిలబడి పరీక్షగా కథలోని 'రామ్మూర్తినీ, ఏదో లోకంలోకి విశ్శబ్దంగా కళ్ళార్పకుండా చూస్తోన్న కృష్ణమూర్తినీ పోల్చి చూశాను.

భయంతో ఒళ్ళు గగుర్పొడిచింది.